క్లుప్తంగా

వ్యాక్సినేషన్

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా కొవిషీల్డ్ మొదటి డోస్ 01, రెండవ డోస్ 03, ప్రికాషన్ డోస్ 06 మందికి వేసినట్లు వైద్యులు పేర్కొన్నారు. 05 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా జీరో పాజిటివ్ అని వైద్యులు పేర్కొన్నారు.

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో 40 మందికి వ్యాక్సినేషన్ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వరదాచారి తెలిపారు. సోమవారం కొవిషీల్డ్ మొదటి డోస్ 6 మందికి , రెండో డోస్ నలుగురికి, బూస్టర్ డోస్ 30 మందికి వేశామని తెలిపారు.

కొవిడ్ పరీక్షలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి, రాయదుర్గం యూపీహెచ్‌సీలో కొవిడ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన పరీక్షల్లో పాజిటివ్ కేసులు నిల్ అని మెడికల్ ఆఫీసర్ శైలజ కీర్తి తెలిపారు.

రూ.50 వేలు విరాళం



శ్రీకాంత్‌గౌడ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని రుద్రారంలో ఈ నెల 7,8,9 తేదీల్లో జరగనున్న శ్రీ మల్లికార్జునస్వామి కల్యాణానికి హాజరు కావాలంటూ నిర్వాహకులు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం శ్రీకాంత్‌గౌడ్ స్వామివారి కల్యాణానికి రూ.50 వేలు విరాళం అందజేశారు. స్వామి కల్యాణ నిర్వాహకులు సంగమేశ్, నరసింహ, సాయి గణేశ్, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన జిన్నారంలో రూ.1.56కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం దర్గా వద్ద రూ. 20లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్, సోలక్‌పల్లిలో రూ.1.10కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవన పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం జిన్నారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యతో పాటు వైద్య సేవలు భారీగా పెరిగాయన్నారు.

2000 మందికి దళితబంధు అందిస్తాం



హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 2023 సంవత్సరంలో 2000 మంది దళితులకు దళితబంధు అందిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని రాజారాంకాలనీకి చెందిన ముకేందర్‌కు దళితబంధు కింద ఎర్టిగా కారును ఆయన అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, గౌతమ్ గౌడ్, చంద్రకాంత్‌రావు, భద్రయ్య, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఇంటికి మిషన్ భగీరథ నీరు

పటాన్‌చెరు: మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని జానకంపేట గ్రామంలో రూ.20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన మిషన్ భగీరథ ట్యాంక్ నిర్మాణ పనులకు, కిష్టారెడ్డిపేటలోని వెంకటరమణ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీలలో జీవీఆర్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ సౌజన్యంతో రూ.70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ నూతన కాలనీలకు సైతం ప్రణాళికాబద్ధంగా మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

వైకుంఠ ఏకాదశి వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



భక్తులతో కిటకిటలాడుతున్న చందానగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం





వినాయక్‌నగర్‌లోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూ, స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



టెలికామ్‌నగర్‌లో..



చందానగర్‌లో..

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని సోమవారం ఆలయాలు కిటకిటలాడాయి. ఉత్తర ద్వార దర్శనానికి తెల్లవారుజాము నుంచి భక్తులు బారులుదీరారు. స్వామి వారికి అర్చనలు, అష్టోత్తర పూజలు, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పల్లకీసేవ నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని ఆలయాలను విద్యుత్‌దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

– శేరిలింగంపల్లి జోన్‌బృందం

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆల్విన్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయం, మండల పరిధిలోని లక్డారంలోని పురాతన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు సువర్ణ మాణిక్ రెడ్డి, సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, నేతలు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, మండల అధ్యక్షుడు పాండు పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్‌లో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలు ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు.



హుడాట్రేడ్ సెంటర్‌లో..కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్



మియాపూర్ బీకే ఎన్‌క్లేవ్‌లో..



పూజలో పాల్గొన్న బీజేపీ నాయకులు



ధర్మపురి క్షేత్రంలో..



టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో..

ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రుద్రారం సిద్ధి గణపతి దేవాలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.1.50 కోట్ల సొంత నిధులతో మూడు రాజగోపురాల నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే దంపతులు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంతో ప్రాశస్త్యం పొందిన సిద్ధి గణపతి ఆలయాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పురాతన ఆలయాల జీర్ణోద్ధారణతో పాటు, నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ సుధీర్ రెడ్డి, ఎంపీటీసీ రాజు, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాండు, నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాణిక్ రెడ్డి, రాజు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈట మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రుద్రారం గణేశ్‌గడ్డ దేవస్థానంలో ఎమ్మెల్యేతో పాటు ఆలయ సిబ్బంది, నాయకులు

4నుంచి టీఐఈఎస్ వార్షిక సమావేశాలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో జనవరి 4–6 వరకు ఇండియన్ ఎకనామెట్రిక్ సొసైటీ(టీఐఈఎస్) 57వ వార్షిక సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని ఆడిటోరియంలో బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. భారత ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ డా.బిబేక్ దేబ్రాయ్ ప్రసంగిస్తారు.

ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంటి పెద్ద మృతితో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న బీజేపీ నేత శివసాయి కృష్ణ కుటుంబ సభ్యులకు రూ. 10వేల సాయం సోమవారం అందించారు.

రంగోలి పోటీల్లో లక్డారం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ పీపీ రాథోడ్

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని లక్డారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గత నెల 20, 21, 22 తేదీల్లో కంది అక్షయపాత్ర హరేకృష్ణ హెరిటేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ కనబరిచారు. రంగోలీలో మొదటి స్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎంఈఓ పీపీ రాథోడ్, డ్రాయింగ్ టీచర్ శివకుమార్ చేతుల మీదగా సర్టిఫికెట్లు అందజేశారు.

కొత్త ఏడాది జీరో యాక్సిడెంట్ డే



సీపీ స్టీఫెన్ రవీంద్రకు కేక్ తినిపిస్తున్న కానిస్టేబుల్

- గతేడాది సైబరాబాద్‌లో 12 శాతం క్రైమ్ రేట్ తగ్గింది
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: సైబరాబాద్ పరిధిలో పోలీసుల చొరవతో నూతన సంవత్సరం జీరో యాక్సిడెంట్‌డేగా నిలిచిందని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో సోమవారం ఆయన పోలీసు సిబ్బందితో కలిసి నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైబరాబాద్ పరిధిలో గత ఏడాదితో పోల్చితే 12 శాతం క్రైమ్ రేట్ తగ్గిందన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీలు సింగనవార్ కల్మేశ్వర్, టి శ్రీనివాసరావు, శిల్పవల్లి, జగదీశ్వర్‌రెడ్డి, సందీప్, కవిత, ఇందిర, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ రియాజ్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బంది, సీఏఓలు గీత, చంద్రకళ,ఎస్‌సీఎస్‌సీ ప్రధాన కార్యదర్శి కృష్ణ ఎదుల, సైబరాబాద్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి, జాయింట్ సెక్రెటరీ వెంకటయ్య, ఆర్గనైజేషన్ సెక్రటరీ కృష్ణారెడ్డి, సైబరాబాద్ కోశాధికారి జి మల్లేశం, సీపీ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను సైబరాబాద్ హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్‌కుమార్ సోమవారం కమిషనరేట్‌లో కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించారు.

హెచ్‌సీయూ, కేఎఫ్‌ఆర్‌సీల మధ్య ఒప్పందం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్ (కేఎఫ్ఆర్‌సీ)ల మధ్య గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో సోమవారం ఒప్పందం కుదిరింది. కేఎఫ్ఆర్‌సీ పరిశోధన, శిక్షణ, జ్ఞాన సమాచారాన్ని పరస్పరం పంచుకోవడానికి ,అన్ని కిమ్స్ నెట్‌వర్క్ ఆస్పత్రులకు నోడల్ సెంటర్‌గా కూడా పనిచేస్తుంది. బయోటెక్నాలజీ, మాలిక్యూలర్ బయాలజీ, కేన్సర్ బయాలజీ, రీజెనరేటివ్ మెడిసిన్స్, న్యూరాలజీ/న్యూరోసైన్స్, కార్డియాలజీ విభాగాల్లో మాస్టర్స్, డాక్టోరల్ విద్యార్థులకు బోధన, శిక్షణలో రెండు సంస్థలకు చెందిన ఫ్యాకల్టీలు పాల్గొంటాయి. ఈ ఒప్పంద పత్రాలపై హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, కేఎఫ్‌ఆర్‌సీ చైర్మన్ డాక్టర్ వి భుజంగరావులు హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సమక్షంలో సంతకాలు చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శివకుమార్, ప్రకాశ్ బాబు, డాక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు వినతి



కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆరంభ్‌టౌన్‌షిప్ వాసులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఆరంభ్ టౌన్‌షిప్‌లో పెండింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం కార్పొరేటర్ ఆర్.నాగేందర్ యాదవ్‌ను కోరారు. శేరిలింగంపల్లి లక్ష్మీవిహార్ ఫేజ్–2 కాలనీలోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ ఆరంభ్ టౌన్‌షిప్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు రవీంద్రరాథోడ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రాంభూపాల్‌రెడ్డి, ప్రతినిధులు రాజేష్, బీఆర్ఎస్ నాయకులు అరుణశ్రీ, విజయా చౌహాన్, సరిత, శ్వేత, హరికిషన్, విక్రమ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని జేపీకాలనీలో శ్రీ వేంకటేశ్వర భక్త బృందం అధ్యక్షుడు సీసాల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణం సోమవారం కనుల పండువగా సాగింది. శ్రీవారిని రథంపై ఊరేగింపుగా తీసుకొచ్చి పెళ్లికి ముస్తాబు చేసి కల్యాణం జరిపించారు. అనంతరం వేదపండితులు సుదర్శన హోమం చేశారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ పూజల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సభ్యులు శ్రీనివాస్ ముదిరాజ్, మహేష్, భాస్కర్ పాల్గొన్నారు.





కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తజనం

ఆహ్లాదం..ఆరోగ్యం

- సందర్శకులతో అర్జున్‌రెడ్డి కాలనీ పార్కు కళకళ

మియాపూర్: పార్కులు ఆహ్లాదంతో పాటు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలుగా కొత్తరూపును సంతరించుకుంటున్నాయి. చందానగర్‌లోని అర్జున్ రెడ్డి కాలనీలో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు చేశారు. ఇందులోకి అడుగుపెట్టగానే అందమైన పూల మొక్కలు కనువిందు చేస్తున్నాయి. ఓ వైపు మెత్తని గడ్డి.. మరోవైపు వాకింగ్‌ట్రాక్..మరో పక్క ఓపెన్ జిమ్‌లు ఆకర్షణీయంగా మారాయి. దీంతో అర్జున్‌రెడ్డి కాలనీతో పాటు చుట్టుపక్కల కాలనీలవాసులు ఉదయం, సాయంత్రం పిల్లలతో ఉల్లాసంగా గడుపుతున్నారు.సెలవు దినాల్లో అయితే పార్కు నిండిపోతోంది. ఇక జిమ్‌లూ అందుబాటులోకి రావడంతో యువకులు, మహిళలు, వృద్ధులు ఇలా అందరూ వస్తున్నారు.

- జీహెచ్‌ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ విభాగం ఆధ్వర్యంలో పార్కులో 17 రకాల వ్యాయామ పరికరాలు అమర్చారు.



- ఈ జిమ్‌లో ఎయిర్ వాకర్, ఎయిర్ స్ప్రింగ్, షోల్డర్ వీల్, పుష్ చెయిర్, బేక్ ప్రెష్, స్టాండింగ్, టీస్టార్, డబుల్ క్రాస్ వాకర్ ఇలా కొత్త పరికరాలు అందుబాటులో ఉంచారు.
- ఈ పార్కులో ఉదయం, సాయంత్రం వేళల్లో చుట్టు పక్కల కాలనీవాసులు జిమ్ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. దీంతో పార్కు రద్దీగా మారుతోంది.



వాకింగ్‌తో పాటు..

ప్రతిరోజు వాకింగ్‌తో పాటు వ్యాయామం చేస్తున్నాను. వ్యాయామానికి ఏ పరికరం ఏ విధంగా ఉపయోగపడుతుందోనని సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే అందరికీ బాగుంటుంది. జీహెచ్‌ఎంసీ తరపున కోచ్‌లను నియమించాలి.

–పవన్‌కుమార్, స్థానికుడు

రోజూ పిల్లలతో వచ్చి వ్యాయామం

ప్రైవేటు జిమ్‌లలో వేలాది రూపాయలు వసూలు చేస్తుండడంతో అటు వెళ్లలేక పోతున్నాం. ఇప్పుడు కాలనీల్లో ఓపెన్ జిమ్ అందుబాటులోకి రావడంతో ప్రతిరోజు పిల్లలతో వచ్చి వ్యాయామం చేసుకుంటున్నాము. ఒత్తిడి తగ్గడానికి ఈ జిమ్ ఎంతో ఉపయోగకరం.

–విజయ్, స్థానికుడు

ప్రతి కాలనీలో పార్కు

డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్నాం. ప్రతి కాలనీలో పార్కులను అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తున్నాము. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే గాంధీ సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం.

–కార్పొరేటర్, మంజులరఘునాథ్‌రెడ్డి

సాంగ్ ఆఫ్ ఎ డార్క్ నైట్ చిత్ర ప్రదర్శన

మాదాపూర్: చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన సాంగ్ ఆఫ్ ఎ డార్క్ నైట్ చిత్ర ప్రదర్శనను సోమవారం కళాకారిణి అంజుపొద్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాకారుడు అంతను ప్రామాణిక్ వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. ఈనెల 9వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని, ఉదయం 10 గంటల నుండి రాత్రి 7గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుందని తెలిపారు.





కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

మియాపూర్: హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తుగా కాంగ్రెస్ నాయకులను మియాపూర్, చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను కేసీఆర్ ప్రభుత్వం దారి మళ్లిస్తూ.. నిర్లక్ష్యం చేస్తున్నందుకు వ్యతిరేకంగా సర్పంచ్‌ల సమస్యలకు మద్దతుగా టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ధర్నాకు పిలుపునిచ్చారని తెలిపారు.ఈ నేపథ్యంలో చందానగర్ పోలీసులు డివిజన్ల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ జైపాల్, రామ్‌చందర్‌రాజులను హౌస్ అరెస్ట్ చేయగా రాష్ట్ర ప్రధాన ఏ బ్లాక్ అధ్యక్షులు ఎండి ఇలియాస్ షరీఫ్, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు నల్లగండ్ల రమేష్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు మద్దంగుల తిరుపతి, ఎస్సీసెల్ అధ్యక్షులు కృష్ణ, హఫీజ్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశికాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్, చంద్‌ను ముందస్తుగా మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు.